క్లుప్తంగా

వల్లూరమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో వల్లూరమ్మ తల్లి

టంగుటూరు: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన వల్లూరమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభిషేకాల అనంతరం అమ్మవారి మూలవిరాట్‌ను అర్చకులు ప్రత్యేకంగా అలంకిరంచారు. కుంకుమ పూజ, గోత్రనామార్చనలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. పలువురు భక్తులు వేటలు కోసి మొక్కు చెల్లించారు. వల్లూరమ్మ ట్రస్టు బోర్డు చైర్మన్ కాలె శ్రీనివాసులు, ఈఓ రమేష్ భక్తులకు ఇబ్బంది లేకుండా సౌకర్యాలు కల్పించారు.

వైభవంగా పోలేరమ్మ తిరునాళ్ల


ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

పామూరు: మండలంలోని దాదిరెడ్డిపల్లెలో ఆదివారం గ్రామదేవత పోలేరమ్మ తిరునాళ్ల వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన ఆకుమళ్ల చలపతి ఆధ్వర్యంలో అమ్మవారి మూలవిగ్రహమూర్తికి అర్చకులు దర్భా వెంకటేశ్వర్లు పంచామృతాభిషేకం, కుంకుమపూజ చేశారు. భక్తులు ఆలయం వద్ద పొంగళ్లు పొంగించి ప్రత్యేక పూజల అనంతరం పొంగళ్లను అమ్మవారికి నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయం వద్ద అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో దేవస్థాన కమిటీ, భక్తులు పాల్గొన్నారు.

తల్లిపాలు అమృతంతో సమానం


గురువాజీపేటలో తల్లిపాల వారోత్సవాల ర్యాలీ

కనిగిరి రూరల్: తల్లి పాలు అమృతంతో సమానమని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఎంపీఎస్ పార్వతి అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మండలంలోని గురువాజీపేట సచివాలయ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆదివారం వైఎస్సార్ సంపూర్ణ పోషకాహార కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ సౌందర్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సూపర్‌వైజర్ పార్వతీ మాట్లాడుతూ పుట్టిన శిశువు గంటలోపే ముర్రు పాలు ఇవ్వాలని తెలిపారు. గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. తొలుత తల్లి పాల వారోత్సవాల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ రాజమోహన్‌రెడ్డి, అంగన్‌వాడీ కార్యకర్తలు కుమారి, బాలమ్మ, వెంకట లక్ష్మి, మల్లేశ్వరి, ఝాన్సీ, ఆశావర్కర్లు రూప పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధి పనులకు భూమిపూజ


భూమిపూజ చేస్తున్న జెడ్పీటీసీ సుబ్బయ్య

పామూరు: మండలంలోని వగ్గంపల్లెలో నూతనంగా నిర్మించిన గంగాభవాని ఆలయంలో పలు అభివృద్ధి పనులను ఆదివారం జెడ్పీటీసీ చప్పిడి సుబ్బయ్య భూమిపూజచేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ జాజుల మాల్యాద్రి, గురవమ్మల ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పనులను ప్రారంభించారు. అనంతరం ఆలయంవద్ద ఏర్పాటుచేసిన అన్నదానాన్ని ప్రారంభించగా దేవస్థాన కమిటీ జెడ్పీటీసీ, నాయకులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో దేగా నాగేశ్వరరావు, జంబు క్రిష్ణ, గుమ్మళ్ల రవీంద్ర, జంబు వేణుగోపాల్, మహిళా భక్తబృందం పాల్గొన్నారు.

విప్లవ ధృవతార గద్దర్


గద్దర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రజా సంఘాల నాయకులు


కందుకూరులో ప్రజా సంఘాల నాయకుల కొవ్వొత్తుల ప్రదర్శన

కనిగిరి రూరల్: ప్రజా ఉద్యమకారుడు, ప్రజా కవి, ప్రజా గాయకుడు, ప్రజా యుద్ధ నౌక తన పాటలతో ఉమ్మడి రాష్ట్రాల్లో ప్రజా ఉద్యమాలు నిర్మించి విప్లవ ధృతార గద్దర్ అని పలువురు నాయకులు కీర్తించారు. గద్దర్ చిత్రపటానికి స్థానిక సుగుణా వతమ్మ సెంటర్‌లో వివిధ సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో పలువురు నాయకులు మాట్లాడుతూ ప్రజా కవి గద్దర్ మృతి యావత్ కార్మిక, కర్షక, దళిత బహుజన వర్గాలకు తీరని లోటన్నారు.

గద్దర్ మృతితో ప్రజా గొంతుక మూగబోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డీహెచ్ పీఎస్ జిల్లా కార్యదర్శి పందిటి మోహన్, బీటీఏ జిల్లా నాయకులు దద్దాల శ్రీనివాసుల యాదవ్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు జి.రవికుమార్, సీపీఐ, సీపీఎం నాయకులు బడుగు వెంకటేశ్వర్లు, వై రవీంద్ర బాబు, సయ్యద్ నాయబ్ రసూల్, పలు సంఘాల నాయకులు కటికల అగస్టీన్, బారాహి మాం, పెద్దన్న చెరుకూరి చిన కాశయ్య, బ్రహ్మయ్య పాల్గొన్నారు.

గద్దర్ మృతి ప్రజా ఉద్యమానికి తీరని లోటు

కందుకూరు: దళిత బహుజన సాహిత్య సాంస్కృతిక యోధుడు గద్దర్ మృతి ప్రజా ఉద్యమానికి తీరని లోటని పలు ప్రజాసంఘాల నాయకులు అన్నారు. గద్దర్ మృతికి సంతాపంగా ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి స్థానిక అంబేద్కర్ బొమ్మ వద్ద కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. పీడిత ప్రజల పక్షాన నిలబడి ఆడి పాడిన విప్లవకారుడని, తన గళాన్ని, కలాన్ని సామాజిక ఉద్యమానికి అంకితం చేశారని కొనియాడారు. సామాజిక ఉద్యమానికి, సాహిత్యానికి గద్దర్ మృతి తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కె.మోహన్‌రావు, బి.వెంకటేశ్వర్లు, పాలేటి కోటేశ్వరరావు, గేరా చిరంజీవి, ముప్పవరపు కిశోర్, బండి గోవింద్, దారా నరశింహం, చార్వాక, చనమాల కోటేశ్వరరావు, గడ్డం వెంకట్రావ్, పూరిమిట్ల మాధవరావు, గడ్డం శివరామయ్య, గాండ్ల హరిప్రసాద్, షేక్ రఫీ, జడ భాస్కర్, దమ్ము థామస్, దాసరి మల్లిఖార్జున, సుదర్శి శ్యామ్, సాదు సూర్యనారాయణ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గోపూజ, మహా నివేదన


గో పూజలో పాల్గొన్న ఆలయ కమిటీ, భక్తులు


ప్రదక్షిణలు చేస్తున్న అర్చకులు, కమిటీ సభ్యులు, భక్తులు

సీఎస్‌పురం (పామూరు): మండలంలోని ప్రఖ్యాత పుణ్యక్షేత్రం మిట్టపాలెం నారాయణస్వామి ఆలయంలో ఆదివారం మహానివేదన, గోపూజ అర్చకులు మంకాల సత్యనారాయణ వేదమంత్రాలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గోవును శుచిచేసి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. అనంతరం నారాయణస్వామి మూలవిగ్రహమూర్తికి పంచామృతాభిషేకం తేనె, పాలు, చక్కెర, పెరుగు, నెయ్యితో అభిషేకం చేశారు. స్వామి గర్భాలయాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. అనంతరం భజంత్రీల మేళతాళాల నడుమ బెల్లం పొంగలిని మహా నివేదనగా సమర్పించేందుకు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి స్వామికి నైవేద్యంగా సమర్పించారు. పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకోగా దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ వ్యవస్థాపక చైర్మన్ కొమ్మినేని చినఆదినారాయణ, కార్యనిర్వాహణాదికారి నర్రా నారాయణరెడ్డి, కొమ్మినేని వెంకటరావు, ముడుమాల నారాయణరెడ్డి, భక్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



పేదల ఇళ్ల స్థలాలు ఆక్రమిస్తే చర్యలు


పేదలతో మాట్లాడుతున్న చైర్మన్ అబ్దుల్ గఫార్

కనిగిరి రూరల్: పేదలకు వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందని మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ అన్నారు. పదో వార్డులోని స్థానిక అర్బన్ కాలనీలో పేదలకిచ్చిన పట్టాలను కొందరు దౌర్జన్యంగా ఆక్రమిస్తున్నారని, తాము నిర్మించుకున్న కట్టడాలను పడగొడుతున్నారని ఇళ్ల స్థలాలు పొందిన మహిళలు మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్‌కు ఆదివారం ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన చైర్మన్ అబ్దుల్ గఫార్ ఘటన స్థలానికి వెళ్లి బాధితులతో మాట్లాడారు. సుమారు 10 ఏళ్ల క్రితం తమకు అర్బన్ కాలనీలో ఇళ్ల పట్టాలు ఇచ్చారన్నారు. తమకిచ్చిన పట్టాల్లో ఇళ్లు నిర్మించుకుంటుంటే.. చాకిరాలకు చెందిన కొందరు వ్యక్తులు వచ్చి దౌర్జన్యంగా ఆపుతున్నారన్నారు. అదేమని ప్రశ్నిస్తే తమపై దాడికి దిగుతున్నారని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో చైర్మన్ గఫార్ మాట్లాడుతూ పట్టా దారులంతా కలిసి సోమవారం తహసీల్దార్‌కు, ఆర్డీఓకు, సీఐకు ఫిర్యాదు చేయాలని తెలిపారు. మహిళలపై దాడికి ఉపక్రమిస్తే 100, లేదా 181, లేదా 112 కు కాల్ చేయాలని, నేరుగా ఎస్పీకి ఫిర్యాదు చేయాలని తెలిపారు. దౌర్జన్యంగా పేదలకిచ్చిన పట్టాలను ఆక్రమించాలని చూస్తే..ఎంతటి వారిపైనైనా చట్టపరమైన చర్యలుంటాయన్నారు. కౌన్సిలర్ దాసరి మురళీ కృష్ణ, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సుదర్శన్ థియేటర్ యజమాని మృతి


కూరపాటి శ్రీనివాసులరెడ్డి (ఫైల్)

కనిగిరి రూరల్: కోఆపరేటివ్ సొసైటీ మాజీ డైరెక్టర్, సుదర్శన్ థియేటర్ యజమాని కూరపాటి శ్రీనివాసులరెడ్డి(78) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. స్థానిక పాతూరులోని స్వగృహంలో శ్రీనివాసులరెడ్డి భౌతికకాయాన్ని పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు సందర్శించి నివాళులర్పించారు. కార్యక్రమంలో పీడీసీసీ బ్యాంక్ చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ వైఎం సరితా ప్రసాద్‌రెడ్డి, రెడ్డి కార్పొరేషన్ చింతల చెరువు సత్యన్నారాయణరెడ్డి, మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్, మాజీ ఎంపీటీసీ భూతలపల్లి మాలకొండారెడ్డి, సీపీఐ జిల్లా నాయకులు వై రవీంద్రబాబు, సయ్యద్ యాసీన్, కౌన్సిలర్లు దాసరి మురళీ కృష్ణ, సయ్యద్ రిజ్వానా ఖాలక్, కోఆప్షన్ సభ్యుడు చింతం ను, మాజీ వైస్ చైర్మన్ వీవీఆర్ మనోహర్‌రావు, మాజీ వార్డు సభ్యుడు ఎస్ ఎన్ రసూల్, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

శ్రామిక గర్జనను జయప్రదం చేయాలి

కనిగిరి రూరల్: కేంద్ర ప్రభుత్వ విధానాల వల్ల కార్మిక వర్గం నలిగిపోతుందని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ యాసీన్ అన్నారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శ్రామిక గర్జనను జయప్రదం చేయాలని కోరుతూ ఆదివారం పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు జి.బాలిరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సయ్యద్ యాసీన్ మాట్లాడుతూ కార్పొరేట్ శక్తులను కొమ్ము కాస్తూ దేశాన్ని నాశనం చేస్తున్న ప్రధాని నరేంద్ర మోడీని గద్దె దించాలి, దేశాన్ని రక్షించాలి అనే నినాదంతో కార్మికులంతా ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. కార్మిక, రైతు వ్యతిరేక చట్టాలను కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తుందని ఘాటుగా విమర్శించారు. దేశాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఆగస్టు 9న విజయవాడలో జరిగే శ్రామిక గర్జనలో శ్రామికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి జీపీ రామారావు, గులాం హుస్సేన్, ఏఐటీయూసీ, వివిధ సంఘాల నాయకులు సుబ్బారావు, పవన్ కళ్యాణ్, ఇఫ్రాజ్, అశోక్, కోటయ్య, ఐజాక్, మధు తదితరులు పాల్గొన్నారు.

రూ.25.13 కోట్లతో రైల్వేస్టేషన్ ఆధునికీకరణ


బహుమతులు అందజేస్తున్న నాయకులు

సింగరాయకొండ: స్థానిక రైల్వేస్టేషన్‌ను రూ.25.13 కోట్ల అంచనా వ్యయంతో ఆధునికీకరిస్తున్నట్లు బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేందర్‌రెడ్డి పేర్కొన్నారు. అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా జాతీయ స్థాయిలో మొదటి ఫేజ్‌లో మంజూరైన నిధులతో స్థానిక రైల్వేస్టేషన్‌లో అభివృద్ధి పనులకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదివారం వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. రైల్వేస్టేషన్‌ను ఆధునికీకరించడంతోపాటు అన్ని రకాల వసతులు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. రైల్వేస్టేషన్‌లో చేపట్టవలసిన అభివృద్ధి పనులపై విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీలో ప్రతిభ కనబరచిన వారికి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. కార్యక్రమంలో రైల్వే అధికారులు, వివిధ పార్టీల నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జేవీవీ మహాసభలు జయప్రదం చేయండి

పామూరు: కనిగిరిలో ఈ నెల 12, 13 తేదీల్లో జరగనున్న జనవిజ్ఞానవేదిక జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని జేవీవీ జిల్లా అధ్యక్షుడు షేక్.ఖాజాహుస్సేన్ పేర్కొన్నారు. స్థానిక జేవీవీ కార్యాలయంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పాఠ్యపుస్తకాల్లో డార్విన్ సిద్ధాంతాన్ని తొలగించడం అశాస్త్రీయ అంశమన్నారు. మహారాష్ట్ర, కేరళ మాదిరిగా ఆంధ్రప్రదేశ్‌లో కూడా మూఢనమ్మకాల నిరోధక చట్టాన్ని తీసుకురావాలన్నారు. అనంతరం పామూరు మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జి.శ్రీనివాసులు, శంకర్, వెంకట్రావు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం మేలు

పొన్నలూరు: ప్రకృతి వ్యవసాయంతో రైతులకు మేలు కలుగుతుందని ఎంసీఆర్పీ కోటేశ్వరరావు పేర్కొన్నారు. మండలంలోని రావులకొల్లు గ్రామంలో ఆదివారం ప్రకృతి వ్యవసాయ మందుల ఎన్‌పీఎం షాపును ప్రారంభించి, పలు రకాల ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ.. ప్రకృతి సిద్ధమైన ఐదు రకాల ఆకులు, ఆవు మూత్రం కలిపి తక్కువ ఖర్చుతో బ్రహ్మాస్త్రం తయారు చేసుకుని పొలంలో పిచికారీ చేస్తే ఫలితం ఉంటుందన్నారు. ప్రస్తుత మార్కెట్‌లో ప్రకృతి వ్యవసాయంతో పండించిన ఆహార ధాన్యాలకు ఎక్కువ డిమాండ్ ఉందన్నారు. కార్యక్రమంలో కేఆర్పీ శ్రీనివాసులు, రైతులు పాల్గొన్నారు.



ఆర్టీసీ బస్సుల సంఖ్య పెంచాలి


సుప్రజరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న సింగరాయకొండ అప్డేట్ సభ్యులు

సింగరాయకొండ: స్థానిక ఆర్టీసీ బస్‌స్టేషన్ పరిధిలో ప్రయాణికుల ఇబ్బందులు తీర్చాలని కోరుతూ ఆదివారం ఏపీఎస్ఆర్టీసీ నెల్లూరు జోన్ చైర్మన్ బత్తుల సుప్రజరెడ్డికి సింగరాయకొండ అప్డేట్ సభ్యులు వినతిపత్రం అందజేశారు. బస్‌స్టేషన్‌కు సుమారు 100 బస్‌సర్వీసులు రావాల్సి ఉన్నా సుమారు 40 మాత్రమే తిరుగుతుండటం, రాత్రి వేళ సింగరాయకొండ బైపాస్ మీదుగా బస్సులు వెళ్లిపోవడం వల్ల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. సమస్య పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. కాకా సాయితేజ, చెన్నంశెట్టి హరిబాబు,షేక్ మస్తాన్, మొద్దు బాలాజీ పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

లింగసముద్రం: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై ఆవుల వెంకటేశ్వర్లు చెప్పారు. వివరాల ప్రకారం ఆదివారం ఉదయం 7 గంటల సమయంలో మండలంలోని వీఆర్ కోట గ్రామం వద్ద ఉన్న మన్నేరు నుంచి ఇసును తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో సిబ్బందితో వెళ్లి వీఆర్ కోట రైస్‌మిల్లు వద్ద ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు చెప్పారు. ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించి డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

